సాక్షి
నిజామాబాద్
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

డీఎస్పీగా చేరిన నిఖత్



నిజామాబాద్‌నాగారం: జిల్లాకుచెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీ పోస్టు ఇచ్చిన విషయం తెలసిందే. ఈ మేరకు ఆమె బుధవారం డీజీపీ జితేందర్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. త్వరలోనే ఆమెకు పోస్టింగ్ ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిఖత్‌కు రూ.2 కోట్లతోపాటు హైదరాబాద్‌లో నివాస స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అర్జున అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

డెంగీతో యువతి మృతి



సంగీత (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని అమ్రాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వెంకట్రాంనాయక్ తండాకు చెందిన సంగీత (22) డెంగీతో బుధవారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బదావత్ వసంత్ రావు, శాంతాబాయికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె అయిన సంగీత నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాలుగేళ్లుగా నర్సుగా పనిచేస్తోంది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ తాను పని చేస్తున్న ఆస్పత్రిలోనే చికిత్స పొందింది. పరిస్థితి విషమించడంతో మరో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. పక్షవాతంతో బాధపడుతున్న తల్లి శాంతాబాయికి సేవలు చేసిన సంగీత మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. మామిడిపల్లికి చెంది యువసేన యూత్ మండలి వినాయకుడి విగ్రహాన్ని క్రేన్ సహాయంతో పైకి లేపుతున్న క్రమంలో క్లిప్‌లో నుంచి విగ్రహం జారిపడడంతో మహేశ్ అనే యువకుడి చేయి విరిగింది. బాధితుడిని యూత్ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం నుంచి మరో రెండు వినాయక విగ్రహాలు ఇలాగే క్లిప్ నుంచి జారిపడ్డాయి. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విగ్రహాలన్నింటిని క్రేన్‌తో ఒకే దగ్గర వేస్తుండడంతో మునగడం లేదని గణేశ్‌మండలిల నిర్వాహకులు ఆందోళనకు దిగగా, పోలీసులు వారిని సముదాయించారు.

గోవిందా హరి గోవిందా

- ముగిసిన జెండా బాలాజీ ఉత్సవాలు
- పుర వీధుల్లో జెండా ఊరేగింపు

నిజామాబాద్ రూరల్: గోవింద నామ స్మరణతో నిజామాబాద్ నగర వీధులు మార్మోగాయి. 14 రోజులపాటు వైభవంగా కొనసాగిన జెండా జాతర ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజైన బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో జెండా బాలాజీ ఆలయం కిటకిటలాడింది. సాయంత్రం నాలుగు గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణలతో జెండాకు ఆనవాయితీగా అజయ్ సంగ్వాయి, సంజయ్ సంగ్వాయి, విజయ్ సంగ్వాయి ప్రత్యేక పూజలు చేశారు. జెండాను ఆచారం ప్రకారం గోడపై నుంచి దాటించారు. సిర్నాపల్లి గడిలో జెండాకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి గోల్ హనుమాన్ ఆలయానికి చేరుకోగా భక్తులు చక్కెరను స్వామివారికి సమర్పించి పూజలు చేశారు. సిర్నాపల్లి గడి నుంచి పూలాంగ్ వరకు శోభాయాత్ర సాగింది. పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ అర్బన్, బోధన్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకుని జెండాకు పూజలు చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికి దేవునిపై నమ్మకం ఉండాలని, ఆధ్యాత్మికతతో మనిషికి మోక్ష మార్గం లభిస్తుందన్నారు. ధన్‌పాల్ మాట్లాడుతూ.. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నిజామాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి గింజుపల్లి వేణు, జాలిగం గోపాల్, రామాగౌడ్, రాజేశ్వర్, గాయని విజయ, పోలకొండ నర్సింగరావు, నాగభూషణం, సంతోష్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, శివరాత్రి ఆంజనేయులు, అర్చకుడు వెలుగలేటి నాగరాజుచారి, జయరాజ్, భక్తులు పాల్గొన్నారు.



నగరంలో జెండా జాతరలో పాల్గొన్న భక్తులు.. (ఇన్ సెట్‌లో) భక్తుల కోలాటం









ఉమ్మెడ వద్ద భారీ విగ్రహాల నిమజ్జనం

భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం రెండో రోజు బుధవారం కొనసాగింది. జిల్లా కేంద్రం నుంచి ఎనిమిది అడుగుల కంటే ఎత్తు ఉన్న విగ్రహాలను నందిపేట మండలం ఉమ్మెడ వద్ద గోదావరి నదికి తరలించారు. అక్కడి వంతెనపై నుంచి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు. నగరం నుంచి భారీ విగ్రహాలను తరలించడంలో మండళ్ల నిర్వాహకులు తీవ్రంగా శ్రమించారు. రోడ్లపై తరుచూ అడ్డం వస్తున్న విద్యుత్ తీగలను పైకి లేపుతూ విగ్రహాలను తీసుకెళ్లారు. విగ్రహాల నిమజ్జన ఘట్టం నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్, బోధన్ పట్టణాల్లోనూ కొనసాగింది. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్







నగరం నుంచి ఉమ్మెడకు నిమజ్జనం కోసం తరలుతున్న భారీ గణనాథులు

ఫొటోలు : సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రుణమాఫీ అయినా.. 'రణం' చేయాల్సిందే..

- గ్రామాల్లో హుకుం జారీ చేస్తున్న వీడీసీలు, కులసంఘాలు
- ధర్నాకు రాకపోతే జరిమానాలు వసూలు చేస్తున్న వైనం
- మదనపడుతున్న పలువురు రైతులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి రుణమాఫీ వచ్చినప్పటికీ 'రణం' చేయాల్సిందేనని జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులకు హుకుం జారీ చేస్తుండడంతో వారు లోలోన కుమిలిపోతున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో సమాంతర వ్యవస్థ మాదిరిగా వ్యవహరిస్తున్న గ్రామాభివృద్ధి కమిటీలు, కుల సంఘాలు ఈ ఆదేశాలను జారీ చేయడంతో పలువురు రైతులు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బ్యాంకర్లు, సహకార సంఘాల సిబ్బంది చేసిన తప్పుల కారణంగా కటాఫ్ తేదీ కుదరకపోవడంతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదు. అదేవిధంగా సాంకేతిక సమస్యల కారణంగా మరికొందరు రైతులకు రుణమాఫీ కాలేదు. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన వివరాలు తీసుకున్నారు. గ్రామాల్లో సర్వే సైతం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే విపక్షాలు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాయి. జిల్లాలో పలుచోట్ల గ్రామాభివృద్ధి కమిటీలు, కుల సంఘాలు సైతం ఆందోళనలు, ధర్నాలకు పిలుపునిచ్చాయి. పలుచోట్ల ధర్నాలు చేశారు. ఇకపై కూడా ఆందోళనలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పలు చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి.



లేకుంటే జరిమానా కట్టాల్సిందే..

జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లోని మండలాల్లో చాలా వీడీసీలు, కులసంఘాలు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ పథకం విషయమై రైతుల పట్ల ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. రైతుల్లోనూ వివిధ పార్టీలకు చెందిన సానుభూతిపరులు ఉండడం సహజం. అదేవిధంగా రుణమాఫీ పొందిన రైతుల్లో నైతికత అనేది ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినప్పటికీ నైతికతకు విరుద్ధంగా సంఘాలతో కలిసి ఆందోళనలకు దిగాలంటే మనసొప్పడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధి పొందని వాళ్లు ధర్నాలు చేస్తే ఒక లెక్క ఉంటుందని, రుణమాఫీ దక్కినప్పటికీ ఆందోళనకు దిగాలంటే చాలా ఇబ్బందిగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో పలువురు రైతులు ఆయా గ్రామాల్లో ఇప్పటికే జరిమానాలు సైతం చెల్లించడం విశేషం. ప్రతి ధర్నాకు ఇలా జరిమానాలు చెల్లించుకుంటూ పోవాలంటే సమస్యగా మారుతోందని బాధిత రైతులు పేర్కొంటున్నారు. ఎక్కువ గ్రామాల్లో వీడీసీలు, కులసంఘాలు ముక్కుపిండి జరిమానాలు వసూలు చేస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో జరిమానాలు తీసుకోకుండా కచ్చితంగా ఆందోళనల్లో పాల్గొనాల్సిందేనని అల్టిమేటం జారీ చేయడం పట్ల రైతులు ఎవరికీ చెప్పుకోలేక పోతున్నారు. ప్రతిరోజూ అదే గ్రామంలో నివసించాల్సిన నేపథ్యంలో దిక్కుతోచని పరిస్థితుల్లో తాము మానసిక వేదనను భరిస్తున్నామని కొందరు రైతులు చెబుతున్నారు. తమ పేర్లు సైతం బయటకు వెల్లడించవద్దని వేడుకుంటుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. వీడీసీలు, సంఘాలు మంచి విషయాల కోసం కచ్చితత్వంతో వ్యవహరిస్తే తప్పులేదని, ఇలా సమాంతర వ్యవస్థ మాదిరిగా మారి, నియంతృత్వం చెలాయిస్తే ఎలాగని రైతులు అంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఈ విషయమై చొరవ తీసుకుని అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

అంకితభావంతో పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు

- సంక్షేమ వసతి గృహాల పనితీరు మెరుగుపడాలి
- నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- హాస్టళ్ల నిర్వహణ తీరుపై సంక్షేమ అధికారులతో సమీక్ష

నిజామాబాద్‌అర్బన్: సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో పని చేయాలని, వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల పనితీరు మెరుగుపడేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. విద్యా వ్యవస్థను పటిష్టపర్చి విద్యార్థులకు చక్కటి భవిష్యత్‌ను అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లోని పరిస్థితులపై 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే.. జిల్లా ఉన్నతధికారులతో కలిసి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణ తీరుతెన్నులపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం బుధవారం సమీక్షించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని.. గత మూడేళ్లలో ఎస్సెస్సీ ఉత్తీర్ణత వివరాలను హాస్టళ్ల వారీగా తెలుసుకున్నారు. ఇటీవలే జిల్లా ఉన్నతాధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు హాస్టళ్లను తనిఖీ చేసిన సందర్భంగా గమనించిన లోటుపాట్లను ప్రస్తావిస్తూ, వాటిని చక్కదిద్దుకోవాలని సూచించారు. సగటు ఉత్తీర్ణతతోనే సరిపెట్టుకోకుండా, ప్రతి విద్యార్థి మెరిట్ సాధించేలా చొరవ చూపాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుండే చక్కటి ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఉపయోగకరంగా, సౌకర్యవంతంగా ఉండే బ్రాండెడ్ వస్తువులనే వినియోగించాలన్నారు. వసతిగృహాల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని, విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన బోధన అందేలా సంక్షేమ అధికారులు కృషి చేయాలని అన్నారు. తనతోపాటు జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తారని, ఎక్కడైనా లోటుపాట్లు బయటపడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షాసమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, సంక్షేమ శాఖల అధికారులు, ఆర్‌సీవోలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యాశాఖలో నకిలీ ఉద్యోగాలు!

- గ్లోబల్ ఫౌండేషన్ పేరిట నియామకాలు
- నిరుద్యోగుల నుంచి రూ. లక్షల్లో వసూలు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో నకిలీ ఉద్యోగాల నియామకాలు కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్లోబల్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ పక్షం రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో 8 నెలల పాటు వాలంటీర్ల ద్వారా ఉచితంగా సేవలందించేందుకు గాను సమగ్ర శిక్ష అభియాన్ అధికారులను అనుమతి కోరింది. ఈ క్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. 62 మందికి కంప్యూటర్ ఆపరేటర్, 31 మందికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కేటాయిస్తూ నియామక పత్రాలు అందించారు. వాలంటీర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. నియామక పత్రాలు ప్రైవేట్ సంస్థకు సంబంధించినవి ఉండటంతో పాఠశాలల్లో వాలంటీర్లను చేర్చుకోలేదు. ఈ సందర్భంగా కొందరు ఎంఈవోలు, సమగ్ర శిక్ష అభియాన్‌కు చెందిన ఓ అధికారి వసూళ్లకు పాల్పడ్డారు. ఒక్కో వాలంటీర్ నుంచి సుమారు రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు తెలిసింది. అయినా పాఠశాలల్లో వాలంటీర్లను చేర్చుకోకపోవడంతో కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంలో విషయం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈ నియామకాలకు సంబంధించి విచారణ చేయవలసిందిగా డీఈవోను ఆదేశించారు. వాస్తవానికి స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా సేవలు అందించేందుకు తప్పనిసరి కలెక్టర్, డీఈవో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ కలెక్టర్‌కు గానీ, డీఈవోకు గాని సమాచారం లేకుండానే సమగ్ర శిక్ష అభియాన్‌లో నియామకాలు చేపట్టారు.

నకిలీ సర్టిఫికెట్లు

ఇదిలా ఉండగా సర్వశిక్ష అభియాన్ ద్వారా వాలంటీర్ల నియామకం విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా కడెం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి స్వచ్ఛంద సంస్థకు సంబంధం లేకుండా నకిలీ పత్రాలను సృష్టించి 12 మందికి అందించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షా50 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. బాధితులు బుధవారం సమగ్ర శిక్ష అభియాన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రాజుపై మంచిర్యాల్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్‌లో నిరుద్యోగులను మోసం చేసినట్లు కేసులు ఉన్నాయి.

ఉచిత సర్వీసు ఇస్తామంటే అనుమతి ఇచ్చాం

గ్లోబస్ ఫౌండేషన్ ద్వార ఉచిత సర్వీసు ఇస్తామంటే అనుమతి ఇవ్వడం జరిగింది. కాని నిరుద్యోగుల నుంచి కొందరు భారీగా డబ్బులు వసూలు చేశారు. ఇందులో నిర్మల్ జిల్లాకు చెంది ఓ వ్యక్తి నకిలీ నియామక పత్రాలు అందించి డబ్బులు వసులు చేశాడు. బాధితుల నుంచి వివరణ తీసుకున్నాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– శ్రీనివాస్‌రావు, సమగ్ర శిక్ష అభియాన్ సీఎంవో

ఆగమైన ప్రాథమికం

- టీచర్ల బదిలీల తరువాత అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ
- జిల్లాలో 20 శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలే
- ఎస్జీటీల సర్దుబాటు కారణంగా మరింత నష్టం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది సిరికొండ మండలంలోని జగదాంబ తండాలోని ప్రాథమిక పాఠశాల. ఈ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు గత మూడేళ్ల క్రితం చేపట్టిన బదిలీల్లో వెళ్లిపోయాడు. బదిలీల్లో ఈ పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో మరో ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై కొనసాగిస్తున్నారు. 16 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ధర్పల్లి మండలంలోని దుబ్బాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 170 మంది విద్యార్థులకు ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులున్నారు.



సిరికొండ: విద్యాశాఖలో ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల కారణంగా మారుమూల మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా పోయారు. కొందరు పదోన్నతులు పొందగా, మరికొందరు నిజామాబాద్ నగరంతోపాటు బోధన్, ఆర్మూర్ పట్టణాల పరిధిలోని మండలాలకు బదిలీ అయ్యారు. దీనికి తోడు విద్యాశాఖ ఇటీవల చేసిన సర్దుబాటు కారణంగా విద్యార్థుల సంఖ్య లేని ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు పంపించడంతో ప్రాథమిక పాఠశాలలు ఆగమయ్యాయి. చాలా మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారడంతో విద్యార్థులను పంపడానికి తల్లిదండ్రులు జంకుతున్నారు.

బదిలీలు, సర్దుబాట్లతో తీవ్ర నష్టం

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో 2023–24 యూడైస్ లెక్కల ప్రకారం 1.04 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. ఇటీవల పదోన్నతుల్లో సుమారు 270 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొంది ఉన్నత పాఠశాలలకు వెళ్లారు. పదోన్నతులతోపాటు బదిలీల కారణంగా 1500 మందికి స్థానచలనం కలిగింది. సిరికొండ, ధర్పల్లి, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, రుద్రూర్, సాలూర, పాతంగల్, డొంకేశ్వర్ వంటి మారుమూల మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు ఖాళీ అయ్యాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నా టీచర్లు లేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలలకు టీచర్లను కేటాయించకపోవడంతో చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరనే సాకుతో చాలా మంది ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేశారు.

రేషనలైజేషన్ చేస్తేనే ఫలితం

ప్రాథమిక విద్యను గాడిలో పెట్టాలంటే రేషనలైజేషన్ ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది. 2015లో చివరిసారిగా రేషనలైజేషన్ చేశారు. విద్యా హక్కు చట్టం నిబంధనలు కూడా ప్రాథమిక విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు అనే నిబంధనను సవరించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. అవసరం ఉన్న చోట ఎప్పటికప్పుడు విద్యా వలంటీర్లను నియమిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

యూ–డైస్ గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 20వేల మంది విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమిక విద్యకు దూరమయ్యారు. గతంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య అంతకంతకూ తగ్గుతూ వస్తోంది. బదిలీలు, పదోన్నతులు, సర్దుబా టు, పదవీ విరమణలు ఎక్కువగా ఉండటం కారణంగా జిల్లాలో సుమారు 136 ప్రాథమిక పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. వేల్పూర్ మండలం పడగల్, అంక్సాపూర్, మోతె వంటి పెద్ద పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ధర్పల్లి మండలం సీతాయిపేట్, దుబ్బాక, చల్లగరిగె, రేకులపల్లి, మైలారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. జిల్లా లోని చాలా మండలాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇవ్వాలి



విద్యార్థుల సంఖ్య పెరగాలంటే పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇవ్వాలి. తగిన పర్యవేక్షణ కోసం ప్రతి పాఠశాలకు పీఎస్ హెచ్‌ఎంను కేటాయించాలి. – అంకం నరేశ్, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

క్లుప్తంగా

ఆగ్రోస్ కేంద్రం తనిఖీ



మాక్లూర్: మండలంలోని మాదాపూర్ రైతు ఆగ్రోస్ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు, ఎరువులు, వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న స్టాకు, రికార్డులు క్రమ పద్ధతిగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పద్మ ఉన్నారు.

ఈనెల 28న తుది ఓటరు జాబితా

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 28న వార్డుల వారీగా తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లోని 27 మండలాలు, 545 గ్రామ పంచాయతీల పరిధిలోని 5020 వార్డులకు సంబంధించి ఓటరు జాబితా టీ పోల్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 13న ముసాయిదా ఓటరు జాబితాను గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా విడుదల చేసిన ట్లు తెలిపారు. అలాగే ఈ నెల 18న గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, గ్రామపంచాయతీలు ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈనెల 14 నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి, 26వ తేదీ నాటికి పరిష్కరించి తుది జాబితాను 28న ప్రచురించడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న 'సాగర్' నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు రెండు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా అంతేమేర నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

చెట్లు నరికివేత.. రూ. 50వేల జరిమానా

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చెట్లు నరికిన వారికి రూ.50వేల జరిమానా విధించినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. కళాశాలలో గత ఆదివారం అటవీ శాఖ అనుమతులు లేకుండా చెట్లను నరికి వేశారు. దీంతో విచారణ చేపట్టిన ఫారెస్టు అధికారులు బాధ్యులను గుర్తించి వారికి జరిమానా విధించారు.

21న జూడో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి జూడో ఎంపికలు అండర్-14,17 విభాగంలో ఉంటాయని ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో ఈ ఎంపికలు ఉంటాయని అన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7893973128 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చేపల వలకు చిక్కిన భారీ కొండచిలువ



లింగంపేట: మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు బొల్లారం సిద్ధయ్య వలకు భారీ కొండచిలువ చిక్కినట్లు గ్రామస్తులు తెలిపారు. మత్స్యకారుడు మంగళవారం గ్రామ సమీపంలో పెద్దవాగుకు చేపల వేటకు వెళ్లగా వలకు 15 అడుగుల భారీ కొండచిలువ చిక్కింది. మత్స్యకారులు కొండచిలువను కర్రలతో కొట్టి చంపారు.

కేజీబీవీలకు బకాయిల భారం

- నాలుగు నెలలుగా విడుదల కాని నిధులు
- ఒక్కో పాఠశాలకు సుమారు రూ.2.50లక్షల వరకు బకాయిలు
- కాంట్రాక్టర్లు సరఫరా చేయని సామగ్రిని ప్రత్యేకాధికారులే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి



ఏర్గట్లలోని కేజీబీవీ భవనం

మోర్తాడ్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు బకాయిలు పేరుకుపోవడంతో ప్రత్యేకాధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ప్రతిరోజూ మూడు పూటలా భోజనం అందించేందుకు తాము అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పాఠశాలల ప్రత్యేకాధికారులు వాపోతున్నారు. సామగ్రి సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ఉన్నా వారు అందించని నిత్యావసర సరుకులు, కూరగాయలు, సిలెండర్లను ప్రత్యేకాధికారులే కొనుగోలు చేస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 25 పాఠశాలల్లో సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి. విద్యార్థులకు ఒక పూట అల్పాహారంతో పాటు, రెండు పూటల భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాల్సి ఉంది. బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తుండగా పప్పులు, నూనెలు, ఇతర సామగ్రిని కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. మిగతా సామగ్రిని ప్రత్యేకాధికారులే కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు నెలకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉంది. జూన్ నుంచి ఇప్పటి వరకు నాలుగు నెలల బిల్లులు అందాల్సి ఉండగా మంజూరు కాలేదు. ఫలితంగా ఒక్కో పాఠశాలకు సుమారు రూ.2.50లక్షల బకాయిలు పేరుకుపోయాయి. గతంలో ఒక నెల బిల్లు మరుసటి నెలలో చెల్లించేవారు. 2023 సెప్టెంబర్‌లో బిల్లుల చెల్లింపులను గత ప్రభుత్వం నిలిపివేయగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన మార్చి, ఏప్రిల్ నెలల్లో పాత బకాయిలు చెల్లించారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభమైన నాటి నుంచి కొత్త బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. రాష్ట్ర ఖజానాలో నిధులు సరిపడినంతగా లేకపోవడంతో బిల్లుల బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం

జూన్ నెలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేసినట్లు ప్రొసిడింగ్ ఇచ్చారు. ఇంకా నిధులు జమ కాలేదు. ఆ తర్వాత నెలల బకాయిలు అలాగే ఉన్నాయి. బిల్లులు సకాలంలో చెల్లించాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు.

– స్వప్న, ప్రత్యేకాధికారిణి, మోర్తాడ్

అటవీ అధికారులకు ఆటల పోటీలు

- ఈ నెల 20, 21 తేదీల్లో జోనల్ స్థాయి క్రీడలు
- పాల్గొననున్న నాలుగు జిల్లాల ఉద్యోగులు



క్రీడల నిర్వహణపై సమావేశమైన అధికారులు

డొంకేశ్వర్: విధుల నిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న అటవీ శాఖ అధికారులు, ఉద్యోగుల మానసిక ఉల్లాసం కోసం ఆటల పోటీలు నిర్వహించనున్నారు. జోనల్ స్థాయిలో నిర్వహించే ఈ క్రీడలు గతేడాది నిర్మల్ జిల్లాలో జరుగగా, ఈ ఏడాది ఇందూరు జిల్లా ప్రాతినిధ్యం వహిస్తోంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం రాజారాం స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించడానికి అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే డీఎఫ్‌వో ఆదేశాల మేరకు ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్వోలు, అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. జోనల్ స్థాయి పోటీల్లో నిజామాబాద్‌తో పాటు నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల అటవీ ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఆటల పోటీలు జరుగనున్నాయి. రన్నింగ్, హైజంప్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఇతర అవుట్‌డోర్ గేమ్స్‌తో పాటు క్యారమ్, చెస్ లాంటి ఇండోర్ గేమ్స్ కూడా నిర్వహించనున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు ఉంటాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులకు వసతులు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడతారు. రాష్ట్ర స్థాయిలో గెలిచిన వారు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఐతే, అటవీ శాఖకు తగ్గట్లుగా జిల్లాకు గుర్తింపుగా ఓ జంతువు బొమ్మతో దుస్తులను సిద్ధం చేశారు. నిజామాబాద్‌కు జింక, ఆదిలాబాద్‌కు టైగర్, నిర్మల్‌కు అడవి దున్న, జగిత్యాల్‌కు చిరుతను చిహ్నంగా పెట్టుకున్నారు. ఈ నెల 20న ప్రారంభమయ్యే అటవీ అధికారుల క్రీడలను బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తాం

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(ఎన్‌డీసీసీబీ)లోని రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తింపజేస్తామని చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయం అభివృద్ధిలో భాగంగా రూ.కోటి అంచనా వ్యయంతో రెండో అంతస్తు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో ఉమ్మడి జిల్లాలో 2వేల మంది రైతులు రుణమాఫీకి అర్హత పొందలేకపోయారని, ఇటీవల వ్యవసాయశాఖ మంత్రిని కలిసి సమస్యను విన్నవించానని తెలిపారు. సమస్యపై ఆయన సానుకూలంగా ఉన్నారని, త్వరలోనే వారికి కూడా రుణమాఫీ అమలవుతుందని అన్నారు. రుణమాఫీ పొందిన రైతులు కొత్తగా రుణాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో నాగభూషణం వందే, డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గొర్కంటి లింగం, సంగ్రామ్ నాయక్, గిర్దావర్ గంగారెడ్డి, శాంతేశ్వర్ పటేల్, ముస్కుల సాయిరెడ్డి, శరత్, కాసల శ్రీనివాస్‌రెడ్డి, నాగంపేట్ శేఖర్‌రెడ్డి, రమేశ్ పాటిల్, భూమన్న, మోతీలాల్, శంకర్, ఆనంద్, భూషణ్‌రెడ్డి, యాదగిరి, బ్యాంకు ఉన్నతాధికారులు లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కమ్మర్‌పల్లి: ఇంటింటా జ్వర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ సిబ్బందికి సూచించారు. కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి పీహెచ్‌సీని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలు, రికార్డులను పరిశీలించారు. జ్వరం కేసులు నమోదైన ప్రాంతాల్లో తక్షణమే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి తప్పనిసరిగా రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. అమ్మఒడి కార్యక్రమం అమలు, లబ్ధిదారుల వివరాలను వైద్యాధికారి సుప్రియను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గురువారం వృద్ధుల కోసం వైద్య శిబిరం, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట జిల్లా ఉపవైద్యాధికారి రమేశ్, డివిజన్ మలేరియా నియంత్రణ అధికారి సాయి, హెచ్‌ఈవో సత్యనారాయణ, ఎల్‌టీ పవన్, ఫార్మసిస్ట్ అరుణ్ ఉన్నారు.

లడ్డూ @ రూ.1,31,111



సుభాష్‌నగర్: నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న శ్రీశ్రీశ్రీ బ్యాంకు కాలనీ గణేశ్‌మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో కాలనీకి చెందిన కాపర్తి సాయికృష్ణ రూ.1,31,111కు దక్కించుకున్నారు. మండలి నిర్వాహకులు సాయికృష్ణ కుటుంబ సభ్యులకు లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ, గణేశ్ మండలి సభ్యులు శశిధర్ రెడ్డి, గోరిశెట్టి సంజయ్, యోగానంద్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, యశ్వంత్‌కుమార్, సాయికేతన్, సూర్యచంద్రారెడ్డి, పరమేశ్వర్, కళ్యాణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌టౌన్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అందించే శిక్షణ కార్యక్రమాలను యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో న్యాక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్స్, భవన నిర్మాణ కార్మికులకు సామగ్రిని అందజేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 970 మంది విద్యార్థులు ఉండడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, గంగాశంకర్, పాషా మొయినొద్దీన్, నాగేశ్వర్‌రావు, శంకర్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ విఠల్, సిబ్బంది, నాయకులు ఉన్నారు.

అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకోవాలి



ఉద్యోగులతో ఆర్టీసీ ఆర్ఎం జాని రెడ్డి

బోధన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చి సంస్థ అందిస్తున్న ప్రగతి రథ చక్రాలు అవార్డులు, నగదు పురస్కారాలు అందుకున్న అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకోవాలని ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జాని రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని, ప్రయాణికులకు ఉత్తమ సేవలందించాలని పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బోధన్ డిపోలో 2024 ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకు త్రైమాసికంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతి రథ చక్రాలు అవార్డులు, నగదు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ఎం ఉద్యోగులకు అవార్డు అందించి అభినందించారు. మిగిలిన ఉద్యోగులు అవార్డులు సాధించేందుకు ప్రతిభ చాటలన్నారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, జిల్లాలోని వివిధ డిపోల మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

63 ఫీట్ల మట్టి గణపతి నిమజ్జనం





నిజామాబాద్‌రూరల్: నగరంలోని పోచమ్మగల్లీలో రవితేజ గణేశ్ మండలి వారు ఏర్పాటు చేసిన 63 ఫీట్ల మట్టి వినాయక విగ్రహాన్ని బుధవారం ఉన్న చోటనే నిమజ్జనం చేశారు. నగర మేయర్ నీతూకిరణ్, ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌కుమార్‌లు ప్రత్యేక పూజలు చేశారు. రవితేజ గణేశ్ మండలి అధ్యక్షులు నీలగిరి రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల వీడియో చిత్రీకరణపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న మహిళలు

రుద్రూర్: వినాయకుని నిమజ్జన శోభాయాత్రలో మహిళల వీడియోలు చిత్రీకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన కొందరు మహిళలు బుధవారం రుద్రూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఈ నెల 16న శోభాయాత్రలో నృత్యం చేస్తుండగా వీడియో తీసి భయభ్రాంతులకు గురి చేసిన యువకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.





జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన జెండా బాలాజీ జాతరలో బోధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

– నిజామాబాద్ రూరల్

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



మధు(ఫైల్)

మాక్లూర్: గణేశ్ నిమజ్జనం కోసం వచ్చిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలంలోని మాణిక్‌బండార్‌లో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపల్లి గ్రామానికి చెందిన మధు(28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మాణిక్‌బండార్‌కు చెందిన గణేశ్ మండప నిర్వాహకులు గణేశ్ నిమజ్జనం కోసం మధును ట్రాక్టర్ డ్రైవర్‌గా మంగళవారం రాత్రి పిలిచారు. ఉదయం వరకు ట్రాక్టర్ గ్రామంలోనే ఉంటుందని మధుకు నిర్వాహకులు చెప్పడంతో సమీపంలోని ఆలయంలో నిద్రించాడు. బుధవారం ఉదయం ఆలయ పూజారి వచ్చి లేపాడు. మళ్లీ కొద్ది దూరంలో నిద్రించాడు. గణేశ్ నిమజ్జన నిర్వాహకులు డ్రైవర్ మధును నిమజ్జనం చేసేందుకని వచ్చి లేపగా విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మరొకరు..

నవీపేట: మండలంలోని కోస్లీ శివారులోని కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. నిజామాబాద్ మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన దేవనమైన చిన్న పోశెట్టి(49) ఈనెల 17న చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. కోస్లీ శివారులోని కుంటలో దిగి గాలం వేసి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు గాలం కాళ్లకు చిక్కుకోవడంతో నీటిలో పడి మృతి చెందాడన్నారు. మృతుడి సోదరుడు పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాకతీయ కాలువలో ఒకరి గల్లంతు



చిన్న మల్లెన్న

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన చిన్న మల్లెన్న అనే వ్యక్తి బుధవారం కాకతీయ కాలువలో గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమల్లెన్న కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కాకతీయ కాలువపై మద్యం సేవించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను నిలిపి వేయించారు. గాలింపు చర్యలు చేపడుతున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు సంబంధించి మూడో టౌన్ ఎస్సై మహేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పవన్‌నగర్‌కు చెందిన సంతోష్(40) కొన్నేళ్లుగా డెయిరీ ఫాం నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం ఎనిమిది పశువులు మృతిచెందాయి. దీంతో ఆర్థిక సమస్యలు నెలకొన్నాయి. ఈ నెల 12న పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడి రిమాండ్

సిరికొండ: మండల కేంద్రంలోని ఓ స్వీట్ దుకాణంలో, గడ్కోల్‌లో హనుమాన్ ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డ హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన గుండెల సుమన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. నిందితుడిపై గతంలో కూడా కేసులు ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన ఇద్దరు యువకులు సమీప ప్రాంతంలో బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం రాత్రి బాసర గోదావరిలో వినాయక నిమజ్జనానికి వెళ్తుండగా గాయాలైనట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

'డబుల్' నిర్మాణాల ఇసుక చోరీ

సిరికొండ: మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించింది. ఇండ్ల నిర్మాణాల కోసం కాంట్రాక్టర్ ఇసుకను డంప్ చేశారు. వాటి నిర్మాణ పనులు నిలిచి పోవడంతో డంప్ చేయగా మిగిలిన ఇసుక అక్కడే నిల్వ ఉంది. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులు నిలిచిపోవడాన్ని అదునుగా తీసుకొని అక్కడ నుంచి కొందరు రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సిరికొండలో మేస్త్రీగా పని చేస్తున్న ఓ వ్యక్తి అక్కడి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఇసుక మాయమవుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ముదక్‌పల్లిలోని ఓ ఇంట్లో..


మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో కుర్నాపల్లి సాయిలు ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయిలు కళావతి దంపతులు సోమవారం ఇంటికి తాళం వేసి నల్లవెల్లిలోని తన కుమార్తె వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం ఉండటంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో చుట్టుపక్కల వారు గమనించి వారికి ఫోన్ చేశారు. వెంటనే వారు ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 2 తులాల బంగారు నెక్లెస్, ఫోన్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వినాయక నిమజ్జనంలో బ్యాండ్ రగడ


ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన గణేశ్ నిమజ్జనంలో బ్యాండ్ రగడ ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. నగరంలోని ఆర్యనగర్‌లో చిన్నపిల్లలు గణేశ్ నిమజ్జనానికి బ్యాండ్ మేళాను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడే బీజేపీ నేతకు చెందిన వినాయక నిమజ్జన ఊరేగింపునకు చిన్నపిల్లల బ్యాండ్‌ను ఆపేసి తమ వద్ద కాసేపు సౌండ్ చేసి వెళ్లాలని డిమాండ్ చేశారు. దీనికి చిన్నారులతో పాటు బ్యాండ్ వారు ససేమిరా అన్నారు. దీంతో బీజేపీ నాయకుడికి కోపం రావడంతో అక్కడున్న చిన్నారులపై చేయి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మాధవనగర్‌కు చెందిన ఓ యువకుడు తన స్నేహితులతో ఆర్యనగర్‌కు వచ్చాడు. చిన్నారులపై ఎందుకు చెయ్యి చేసుకున్నావని బీజేపీ నేతను ప్రశ్నించి చెయ్యి చేసుకున్నారు. సదరు బీజేపీ నేత కోటగల్లీ, శివాజీనగర్ ప్రాంతాల్లోని స్నేహితులను పిలిచి యువకుడి ఇంటి మీదికి దాడి చేసేందుకు వెళ్లారు. గ్రేటెడ్ కమ్యూనిటీ లోకి చొరబడి, ఆ యువకుడు ఇంటి మీదికి రాళ్లతో దాడి చేశారు. గ్రేటెడ్ కమ్యూనిటీకి చెందిన సెక్యూరిటీ గార్డ్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఇరువర్గాలకు ఘర్షణ జరుగుతోంది. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించేందుకు యత్నించినా వినకపోవడంతో లాఠీచార్జి చేసి, రెండు గ్రూపులను చెదరగొట్టారు. ఈ విషయమై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా జరిగిన ఘటనపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మిస్టరీని తలపిస్తున్న చోరీ ఘటన

- భర్త గొంతుపై కత్తిగాట్లు
- చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు



కత్తిదాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన మోహన్



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్

నాగిరెడ్డిపేట: మండలంలోని బంజరా తండాలో మంగళవారంరాత్రి చోటుచేసుకున్న చోరీ, కత్తిదాడి ఘటన మిస్టరీని తలపిస్తోంది. ఘటనలో కత్తిగాట్లకు గురై తీవ్రంగా గాయపడిన మోహన్ భార్య నిర్మల కథనం ప్రకారం.. బంజారతండాకు చెందిన దరావత్ మోహన్ తన భార్య నిర్మల, కొడుకు రాహుల్‌తో కలిసి ఇంట్లో నిద్రించాడు. మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు ముసుగులు ధరించి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు ఇవ్వాలని కత్తితో మోహన్‌ను బెదిరించారని, అందుకు ఆయన నిరాకరించడంతో కత్తితో తన భర్త గొంతును కోశారని నిర్మల తెలిపింది. అదే కత్తితో తననూ బెదిరించి తన మెడలో ఉన్న పుస్తెలతాడును, బీరువాలో ఉన్న నల్లపూసల దండ, కమ్మలు ఎత్తుకెళ్లారని ఆమె చెప్పింది. దొంగల నుంచి తప్పించుకొని ఇంటి ఎదుట గణేశ్ మండపంలో ఉన్న యువకులను నిద్రలేపి జరిగిన విషయం చెప్పి తీసుకొచ్చేలోపు దొంగలు పారిపోయారని నిర్మల తెలిపింది. ఘటనలో కత్తిగాట్లకు గురై తీవ్రంగా గాయపడిన మోహన్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మల్లారెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. మోహన్ భార్య నిర్మలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిర్మలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో చోరీ ఘటన మిస్టరీని తలపిస్తోంది. ఈ విషయమై ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్‌ను వివరణ కోరగా ఘటనకు సంబంధించి విచారణ జరుగుతోందని, విచారణ పూర్తయిన వెంటనే వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.